# చదువుకున్న రైతు

**శ్రీ విప్పర్ల వీర్రాజు**

వెంకట్రావు బి. ఎ. పూర్తిచేసి "లా" చదవడానికి మద్రాసు వెళ్లాడు. కాని వెళ్లిన మూడు నెలలకే తండ్రి చనిపోవడంచేత చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. తను ఒక్కడే కొడుకు కావడం మూలాన్ని సంసారభారం తనమీదపడింది. తనకు ఉద్యోగం చేయాలనే ఉద్దేశమూ లేదు, చేయవలసిన అగత్యమూ లేదు. కాలవక్రిందభూమి అరవై ఎకరాలూ, ఏటిక్రింద భూమి పది ఎకరాలు ఉన్నంత సేపూ ఉద్యోగం చేయడ మెందుకు?

ఈ కాంగ్రెసు గవర్నమెంటున్నన్నాళ్లూ పొలం కౌలుకీయడం మంచిది కాదనుకున్నాడు. అంచేత సూరయ్య అనే ఉద్దారుని సహాయంతో వ్యవసాయం చేయ సమకట్టాడు. చదువుకున్న తను అందరికి మల్లే పూర్వంలాకాకుండా క్రొత్తపద్ధతుల్లో వ్యవసాయంచేసి ప్రభుత్వం దగ్గర్నుండి బహుమతులుపొంది మిగిలిన రైతులకు మార్గదర్శి కావాలి అని నిర్ణయించుకున్నాడు. మిగిలిన పొలాలమీద తన పొలంలో మూడురెట్లు, నాలుగు రెట్లు ధాన్యంపండినట్లు, మున్సీగారు బహుమతి యిచ్చినట్లు కలలు కన్నాడుకూడా.

అసలు ఎప్పుడేమి చేయాలో కూడ తెలీయదు. సూరయ్యచెప్పినట్లు దుక్కులు దున్నించి, ఆకుమళ్లుపోయించాడు. ఈ సంవత్సరం యిలా సూరయ్య దగ్గర నేర్చుకుని వచ్చే సంవత్సరం తను స్వంతంగా బాగా చేయవచ్చు అని సర్దుకున్నాడు. "చదువుకున్న వాడివి నీవు వ్యవసాయ మేం చేయగలవు, అమరకాని కిచ్చేయలేకపోయావూ." అన్నారు కొందరు. "వ్యవసాయంచేయడంలో నా నేర్పరితనం తరవాత చూద్దురు గాని" అని తనలో తనే అనుకున్నాడు.

ఆవూరిలో సుబ్బన్న కూడ పెద్దరైతే. ఏటి క్రింద వెంకట్రావుచేను ప్రక్కను పాతి కెకరాలవరకూ సుబ్బన్నది ఉంది. ఇద్దరిచేలకు ఒకే కాలవలోంచి నీరుపెట్టుకోవాలి. ముందు వెంకట్రావు చేనుండడం వల్ల ఆచేను తడిసినతర్వాత సుబ్బన్న చేనుకు నీరుపోయేది. నీరు తక్కువ వచ్చినప్పుడు సుబ్బన్న చేలో పంట తక్కువ పండేది. ఈ చదువుకున్న రైతు వ్యవసాయం కట్టడంతోనే సుబ్బన్న సంతోషించాడు.

ఆకు మళ్లన్నీ ఎదిగాయి. సూరయ్య సహాయంతో కాలవక్రింద చేను ఊడ్పించేశాడు. ఏటికి నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాడు వెంకట్రావు. ఇంతలోనే ఏటికి నీరూ వచ్చింది, తనచేనుకు వంతూ వచ్చింది. ఆ కాలువకు మూడు రోజులే వస్తుంది నీరు. ఒకరోజు వెంకట్రావు చేనుకు నీరు పెట్టుకున్న తర్వాత సుబ్బన్న చేనుకు నీరు కట్టుకోవాలి. నీరుకట్టి దమ్ము చేయడానికి కావలసిన సరంజామాతో బయలుదేరాడు వెంకట్రావు. అప్పటికప్పుడే సుబ్బన్న తన చేనుకు నీరు మళ్ళించాడు. వెంకట్రావు సుబ్బన్న దగ్గరకు వెళ్లాడు. "అదేమిటి సుబ్బన్న మామా! ముందు మాచేను తడాలటకదూ?" అన్నాడు.

"ఎవరా అన్నది" అని అడిగాడు సుబ్బన్న.

"సూరయ్య అన్నాడు. ప్రతిసంవత్సరం ఎలాపోతుండేదో ఇప్పుడూ అలాగే పోనియ్యి మామా".

"అదికాదోయ్. ఏటామందు మా చేనే తడుస్తుంది. కావలిస్తే కరణాన్ని అడుగు తెలిసినోడు."

"అదేంటండి! అలాగంటారూ, నాలుగేళ్ళబట్టి నేనెరుగుదును పెద్ద కాపు గారు ముందు నీరు కట్టేవోరు" అన్నాడు సూరయ్య.

"ఏడిశావుపోరా. ఏమిట్రా నీవు చూచింది? మా తెలిసినోడులా చెప్పొచ్చావు. 'ఇదిగో వెంకట్రావు వీడు చెప్పినట్లు చేశావంటే వ్యవసాయం చేసినట్లే. శరీరం పెంచానని మదమెక్కి ప్రతిదానికి దెబ్బలాటకు దింపుతాడు. మొన్న మా గేదె చేలోకి వచ్చిందని పాలేరు కుర్రాణ్ణిపట్టుకు తన్నాడు. నిన్ను చూచి ఊరుకున్నాను గాని లేకపోతే అప్పుడే పొతేద్దును."

"నేను చూచింది, చేసింది చెబితే నా మీద పడతా రెందుకండీ" అన్నాడు సూరయ్య ఆరిపోయిన చుట్టను పార వేస్తూ.

"గొడ వెందుకు మామా, మా దివాళ్ళ తడిసి పోతుంది. రేపు, ఎల్లుండి నీవు కట్టుకోవచ్చు" అన్నాడు వెంకట్రావు.

"అలాకాదు వెంకట్రావ్. ఎప్పుడూ జరిగేదేగా. ముందు రెండు రోజులూ నే కట్టుకున్న తర్వాత మీనాన్న కట్టేవాడు"

వెంకట్రావుకు ఏం చేయాలో తెలిసింది కాదు. సుబ్బన్న నీరు ఓపట్టానకట్టుకోనిచ్చేటట్లు లేదు. కరణాన్ని కనుక్కొని నలుగురిచేత చెప్పించాలి అని కరణం దగ్గరకు బయలుదేరాడు. కరణం వయస్సులోకూడా పెద్దవాడు కావడం మూలాన్ని ఏగొడవైనా ఆయనదగ్గర పెడు తుంటారు. కోర్టులో ఎంత న్యాయం దొరుకుతుందో ఆయన దగ్గర అంత న్యాయమే దొరుకుతుంది. ఆయన అప్పుడే భోజనం చేసి చుట్ట చుట్టుకుంటూ అరుగుమీద మరం వేసుకుని కూర్చున్నాడు. వెంకట్రావు వచ్చీరావడంతోనే "ఏటిక్రింద చేను ముందు మాది తడాలా లేకపోతే సుబ్బన్నదా?" అని అడిగాడు.

"ఏం? ఏమైనా గొడవ వచ్చిందా? నువ్వు చిన్నవాడవు. అందులోనూ చదువుకున్నవాడివి. నీకు ఏమీ తెలియదు. అసలు సంగతేమిటి?" అన్నాడు.

"ఏటా మాదిముందు తడిసేదట కాదండీ! సుబ్బన్న కట్టుతూనన్ను కట్టనీయడం లేదు."

"ఎవరిది ముందు తడిస్తే మాత్రం ఒక రోజేగా, తేడా. మీలో మీరే సర్దుకోవాలి. అనవసరంగా గొడవలు పెంచుకోకూడదు. సరే గాని చూడు, నా మామూలిచ్చావు గాదు. మీనాన్న ఎప్పుడూ ఇలా


**పర్గాల్** ఎన్ని మొక్కలమందు కొంచెం కానలోవేసికొని త్రాగిన అన్నిమార్లు సుఖవిరేచన మై ప్రేగులుశుభ్రపడి ఆరోగ్యమునిచ్చును బిడ్డ, పెద్దలందరు వాడవచ్చు. సీసా రు 1. ఖర్చువేరు

కౌండిన్య డిపో, కృష్ణాపురం,
అక్బరాబాద్ పోస్టు – మద్రాసు 24.

చేయలేదు. నీ వైనా ఇవ్వవని కాదు. పొలంగొడవల్లో పడి మర్చిపోయావని జ్ఞాపకం చేస్తున్నాను!!

"తనువచ్చిన పని ఒకటైతే వీడొకటి ఏడుస్తాడేమిటి" అనుకుని "మొన్న మీకు రెండువందల యాభైరూపాయలు పన్ను పంపితే నూట ఎనభై ఐదు కే రసీదిచ్చారేం?" అన్నాడు.

"ఓసి పిచ్చోడా! నిన్ను అన్యాయం చేస్తాననుకున్నావేమిటి. గవర్నమెంటు పన్నుకు రసీదిచ్చాను. ఎస్టేటు పన్నుకు రసీదక్కర్లేదు. నిన్ను మళ్ళీ అడుగుతానా? మరి ఏటా మీ నాన్న ఇచ్చే ధాన్యం బస్తాయే కాకుండా ఏమైనా మినుములు కూడా సర్దాలి. కొందామంటే దొరక్కుండా ఉన్నయ్"

"గవర్నమెంటు పన్ను ఎస్టేటు పన్ను ఇంకా రెండు పన్నులున్నాయా. ఎస్టేటులు గంగలో కలసినా ఎస్టేటుపన్నులు అలా ఉండిపోయా" ఏమిటి అని అడుగుదామనుకుని, "ఛీ ఆ మాత్రం తెలియదు" అని కరణం అనుకుంటాడేమోనని వెళ్ళిపోయాడు. రాత్రి సూరయ్యతో ఆలోచన ప్రారంభించాడు. "రెండే రెండు తోవలండి. జబర్దస్తీగా సుబ్బన్నను తోసేసి కట్టాలి లేకపోతే ఆయన నీరిచ్చేదాకా ఉండాలి" అన్నాడు సూరయ్య. జబరదస్తీ అనడంతోనే వెంకట్రావుగుండె గుభేలుమంది. దెబ్బలాటంటే తనకు చాలభయం. అయినా వెధవ పదెకరాలకూ నీరు ఇవాళ కాకపోతే రేపొస్తుంది. ఈ మాత్రం దానికి రైతులు బుర్రలెందుకు బ్రద్దలు కొట్టుకుంటారో అర్థం కాలేదు. పశువుల్లా దెబ్బలాడుకోవడం తనకిష్టంలేదు. అంచేత సుబ్బన్న నీరిచ్చేవరకు ఉండ నిశ్చయించుకున్నాడు.

"కరణం గోరికి ఒడ్లు బత్తా, మినుములు ఇత్తారన్నారంట కాదండీ" అంటూ వచ్చాడు కరణంతాలూకు మనిషి. "కందులు కూడాఏమైనాఇయ్యమన్నారా"అన్నాడు. "ఇప్పడేమిటిపో" అన్నాడు వెంకట్రావు. వాడు పోయాడు "ఈ మామూలేమిటి ఎప్పుడూ ఉందా సూరయ్యా?" అన్నాడు.

"ఇత్తే ఏడాది పొడిక్కీ అడుగుతాడు." అన్నాడు సూరయ్య.

ఏమయినా ఈ పొలంగొడవ స్థిరపడేదాకా కరణంతో మంచిగా ఉండాలని ఇవ్వడానికే నిశ్చయించుకున్నాడు. సూరయ్య వెళ్ళిపోయాడు.

సుబ్బన్న రెండు రోజులు అయింతర్వాత కూడా వెంకట్రావుకు నీరివ్వలేదు. పోనీలే అని మళ్ళీ వంతుకోసం కూర్చున్నాడు. పది రోజుల తర్వాత వచ్చిన మళ్ళీ వంతు నీరు కూడా సూరయ్యను దబాయించి తన చేనుకే మళ్ళించాడు.

"అదేమిటి మామా, నేనూడ్చుకోనక్కర్లేదూ?" అన్నాడు వెంకట్రావు.

"కనపడ్డంలేదూ ఊడ్చిన చేను ఎండిపోతుంటే?" అన్నాడు సుబ్బన్న.

"అయితే నా చేను బీడు క్రింద ఉండిపోవలసిందే?"

"నా చేనే నామట్టిలో కలసి పోవల్సింది. ఇప్పుడు నీరు పెట్టకపోతే ఇది ఎందుకన్నా పనికొస్తుందా?"

"నీ చేనునిండా నీరుంటే ఎండి పోయిందంటావు ఎక్కడెండిపోయింది?"

"అది ఎండిపోవడం కాదూ? అంతా తెలిసినోడు లాగ మాట్లాడుతావేం"

"మరి మాకు నీరు?"

"దానికి నేనా జబాబుదారీ?"

వెంకట్రావు తన చేలోచెట్టుక్రిందకు పోయి కూర్చున్నాడు. చేనంతా కలయచూచాడు. ఎండి బీటలు వారి ఉంది. "ఇప్పుడేం చేద్దాం సూరయ్యా?" అన్నాడు.

"వందరూపాయలు మీవి కావనుకోండి"

"అంటే?"

"అంటానికేముంది. ఓ పదిమందిని తీసుకొచ్చి సుబ్బన్నను తోసేసికట్టాలి."

దెబ్బలాటంటే వెంకట్రావు కిష్టంలేదు. తనో పదిమందిని తీసుకొస్తే సుబ్బన్నా పదిమందిని తీసుకొస్తాడు. వాళ్ళూ వీళ్ళూ కొట్టుకుచస్తారు. తనూ సుబ్బన్నా బాగానే ఉంటారు. పశువులకు గడ్డికి ఎలాగూ బీడు కొనాలి కాబట్టి ఈ సంవత్సరం దీనిలో మేస్తయ్ అని ఊరుకున్నాడు.

కాలం గడిచేకొద్దీ సుబ్బన్న చేను కలకలాడుతోంది. ఆదారిని పోయేవారందరూ "ఈ చేను చదువుకున్న రైతుది" అని నవ్వుకుంటున్నారు తన చేనుగురించి వెంకట్రావు ఊరుకున్నా ఊళ్ళోవాళ్ళూరుకోలేదు. "తెలియనివాణ్ణి చేసి సుబ్బన్న బుకాయించా" డని కొందరూ, "సుబ్బన్నది వెధవబుద్ధి కాకపోతే ఏటా రెండు చేలూ తడవడం లేదూ" అని కొందరు, "చదువుకున్న వాడికి వ్యవసాయమేమిట"ని కొందరూ, అందరూ అనేక విధాలగా చెప్పుకుంటున్నారు. వెంకట్రావు నలుగురులోనికి రాడానికి సిగ్గుపడుతున్నాడు. ఎక్కడ, ఎవరు ఎందుకు నవ్వినా తన అసమర్థతను చూసినవ్వుతున్నారనుకొనేవాడు. కొంతమంది ఎదురుగానే అన్నారు "లేకపోతే నీకు వ్యవసాయమేమిటి? వచ్చే ఏటికైనా కౌలుకిచ్చేయి. నీకు తెలియదు వ్యవసాయం చేయడం" అని. అందరకు మార్గదర్శి అయ్యేలా వ్యవసాయం చేద్దామనుకున్న తను అందరిముందు ఫూల్ అయ్యానేంటి చెప్మా అని ఆలోచించాడు. ఎక్కడ చూసినా తనకు తెలియదన్నమాటే. ఈ అవమానాన్ని సహించలేకపోయాడు. సుబ్బన్న జయించినాడిలా మీసాలు మెలేసుకుంటూ తిరుగుతున్నాడు. ఏమైనాసరే వచ్చే సంవత్సరమైనా తన తడాఖా చూపించాలనుకున్నాడు.

సంవత్సరం గిర్రున తిరిగిపోయింది. ఆకుమళ్లు పెరిగాయి, ఏటికి నీరువచ్చింది. రేపు వెంకట్రావు చేనుకు వంతు. ఆరాత్రి నలుగురు మాలవాళ్లతో మాట్లాడాడు. అందులో కండలు మెలితిరిగిన నాగడుతో మరీ జాగ్రత్తగా రహస్యంగా మాట్లాడాడు. వెంటనే సుబ్బన్నకు కబురంపాడు రేపు తను నీరు పెట్టుకుంటానని. వెంకట్రావు హడావుడి తెలుసుకున్న సుబ్బన్న తనూ పదిమందిని ఏర్పాటుచేశాడు. నాగడు సుబ్బన్న యింటి ముందునుండి తిట్టుకుంటూ పోతున్నాడు "వీడు వళ్లు తెగబలిసి లంజ...వీడి పని చెయ్యకపోతానా. నాచేతిలో పడకుండా పోతాడా" అని.

"ఎవ్రరా నాగా" సుబ్బన్న అడిగాడు.

"అగ్గిపెట్టి ఓసారిలా పడేయండి. సూరయ్యాండీ ఎద్దు చేలోపడిందని మావోడిని చితకతన్నేసేడు" అని అగ్గిపెట్టి వెలిగించి చుట్ట కాల్చుకుంటున్నాడు "ఈకోపం మీద రేపు వీడు మనకు ఉపయోగపడతాడు" అనుకున్నాడు సుబ్బన్న.

"రేపు మనచేలోకి కూలికిరా. అవసరమైతే సూరయ్యను నాలుగు తాపులు తన్నాలి. ఇంకా వస్తారులే. ఈ అయిదు రూపాయలు ఉండనియ్యి"

"ఓ తప్పకుండా వత్తానండి. చూద్దురుగాని రేపు నామజా" అంటూ పోయాడు నాగడు.

(47-వ పేజీ చూడండి)


## నారసింహలేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిస్త్రాణ, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

# చదువుకున్న రైతు

(38 వ పేజీ తరువాయి)

వెంకట్రావు మర్నాడు ఉదయమే బయలుదేరాడు పొలానికి సూరయ్యను, నలుగురు కూలివాళ్లను తీసుకుని. రైతులు నీరుకట్టేచోట ఎందుకు బుర్రలు బద్దలు కొట్టుకుంటారో కొంచెం కొంచెం అర్థమవుతోందిఅతనికి. అతడు ఇప్పుడనుకున్న పని పూర్తికాకపోతే అంతవరకూ వెళ్ళక తప్పదనుకున్నాడు. వెంకట్రావు వెళ్లేటప్పటికప్పుడే సుబ్బన్న తన చేనుకు నీరు కడుతున్నాడు. సూరయ్యను తన చేను దగ్గర గట్టు వేయమన్నాడు. సూరయ్య గట్టు వేయడం మొదలు పెట్టాడు. "మళ్ళ ఇదేంపని" అంటూ సుబ్బన్న వచ్చాడు. అతని వెనకాల పదిమంది కూలాళ్లూ వచ్చారు. పదిమందిలో నాగడూ ఉన్నాడు. "నిరుడు నీవు కట్టుకున్నావుకమా" అన్నాడు వెంకట్రావు.

"ముందు మాది తడవాలి. గట్టు తీసేయ్ సూరయ్యా"

"గట్టు మాత్రం తీయకు" అన్నాడు వెంకట్రావు.

"రెండు పడేసి గట్టు తీయండ్రా" అన్నాడు సుబ్బన్న.

"అడుగు ముందుకేశారా జాగ్రత్త. ఇదిగో" అంటూ పిస్టలుతీసి గాలిలోకి ఓ సారి ప్రేలించాడు.

"వెళ్ళండ్రా ఏ మాత్రం పేలిస్తాడో చూద్దాం" అన్నాడు సుబ్బన్న. ఎవరికీ ధైర్యం చాల్లేదు. నాగడు మాత్రం కర్రెత్తి ముందుకు వచ్చాడు సూరయ్యను కొట్టడానికి. నాగడికి గురి చూచి పేలించాడు వెంకట్రావు. "బాబోయ్ చంపాడు" అంటూ పొట్టమీద చేయి వేసుకుని ముందుకు పడిపోయాడు. మిగతా వాళ్ళు బిక్కబిక్కలై పారిపోయారు. సుబ్బన్న యింటికి వచ్చిందాకా పరుగు విడువలేదు. కరణానికి ఐదు వందల రూపాయలిచ్చి పోలీసులకోసం కబురంపమన్నాడు. నాగడి శవాన్నెత్తుకుని వెంకట్రావు మనుష్యులు మాయమయ్యారు. ఈ సంగతి అప్పుడే ఊరంతా తెలిసిపోయింది. పోలీసులు వచ్చి వంకట్రావును తీసుకెళ్లి ఉరి తీస్తారని గోలపుట్టింది.

వెంకట్రావు ఇంటికి వచ్చాడు. అతన్ని చూచి కొంతమంది పారిపోయారు. నాగడి శవాన్ని వెంకట్రావు తన యింటికి పట్టించుకుని వెళ్లినట్లు ఎలాకనిపెట్టాడో సుబ్బన్న కనిపెట్టాడు. ఆసంగతి కరణానికి చెప్పాడు. "అయితే మరీమంచిది" అన్నాడు కరణం.

నాగడి పెళ్ళాం వెంకట్రావు ఇంటిముందు నిలబడి నోరూ నెత్తి బాదుకుంటూ ఏడుస్తోంది. పొలాల్లో ఉన్నవాళ్ళు కూడా ఇళ్ళకు పరుగెత్తుకు వచ్చారు ఏం జరుగుతుందో చూద్దామని. సుబ్బన్న గుండెలు ఇంకా కొట్టుకొంటూనే ఉన్నాయి.

ఒక గంటకు ఇరవైమంది పోలీసులతో సబిన్స్పెక్టరూ, సర్కిలూ వచ్చారు. కరణంగారు అన్నీ చెప్పారు. చంపబడ్డమనిషి పేరు, చంపిన మనిషి పేరూ, చంపినమనిషి ఇల్లూ, అన్నీ సాధ్యమైనంత విపులంగా చెప్పారు. కరణానికి మాట్లాడ్డానికి జడుపు పుట్టింది. సమయానికి మునసబు ఊళ్ళో లేనందుకు తిట్టుకున్నాడు. అప్పుడే పోలీసులు వెంకట్రావు ఇంటిచుట్టూ గస్తీ తిరుగుతున్నారు. సబిన్స్పెక్టరూ, సర్కిలూ, నలుగురు పోలీసులూ చేతిలో రివాల్వర్లు పెట్టుకుని లోపల ప్రవేశించారు.

వెంకట్రావును సంకెళ్లువేసి తీసుకెళ్లేటప్పుడు ఎలాగుంటాడో నవ్వుతుంటాడో, ఏడుస్తుంటాడో చూడ్డానికి ఊరంతా ఆ వీధిలో అరుగులమీదకు జేరింది. ఎవరిమట్టుకు వారికే కంగారుగా ఉంది. కొంతమంది కుర్రాళ్ళు పోలీసులను చూచి భయపడి సంగతేమిటో అని చాటునుండి తొంగిచూస్తున్నారు. రైతులు పాలేర్లను పొలం పొమ్మంటున్నారు. "ఇదేం గొడవరా బాబూ" అనుకుంటూ వాళ్లు చాటునుండి తొంగిచూస్తున్నారు. "ఒరే! మీరేం చూస్తార్రా ఇక్కడ పొండి" అని కరణంగారు కుర్రగూకను అదమాయించారు. కుర్రాళ్ళు ప్రతీవాడూ కొరుమీద ఓసారి చేయి వేసి చూస్తున్నారు ఎలాగుంటుందోనని.

సుబ్బన్న నవ్వుతూ మీసం మెలివేస్తూ మఠం. వేసుకు కూర్చున్నాడు అరుగుమీద. "అయితే కరణంగారూ వెంకట్రావును ఉరి తీసేస్తారా?" అని అడిగాడు ఓ రైతు. "ఇంకా అనుమానమేమిటి? మనిషిని చంపితే ఉరితీయరూ" అన్నాడు కరణం గంభీరంగా. "అమ్మో పాపం తండ్రిపోయి సంవత్సరమయిందంతే. అప్పుడే ఇలా రావాలా ఇది" అని సానుభూతి చూపించాడో రైతు.

పావుగంటయినా లోపల ఏం జరిగేదీ తెలియక పోయేసరికి అందరకు ఆత్రుత ఎక్కువయింది. సుబ్బన్న మరీ ఇదవుతున్నాడు. కొంపతీసి ఎక్కడికన్నా పారిపోయేడేమో నని అనుమానం కలిగింది సుబ్బన్నకు. కరణంకూడా శాయశక్తులా ఆలోచిస్తానే ఉన్నాడు లోపలిగొడవ ఎందుకు తెలియలేదా అని. "లంచం పెట్టి వదిలించుకోడం లేదుగదా" అన్నాడు సుబ్బన్న. "ముందు మనం ఐదువందలిచ్చి ఇంకా ఇస్తామని చెబితే మళ్ళీ అక్కడెందుకు పుచ్చుకుంటాడు" అన్నాడు కరణం.

లోపలనుండి పోలీసు వచ్చి నాగడి పెళ్లాన్ని లోపలికి తీసుకెడుతూ గస్తీ తిరిగే పోలీసుల చెవులో ఏదో ఊదాడు. వాళ్లు తుపాకులు క్రిందపెట్టి అరుగులమీద చతికిలబడ్డారు.

"ఆఁ! దొరికాడన్నమాట. అందుకే పోలీసులు గస్తీ తిరగడం మానికూర్చున్నారు." అన్నాడు కరణం. "ఒకే దొరికాడట, దొరికాడట" అనే కేకలు ఎక్కువయ్యాయి జనంలో. మధ్య మధ్య ఒక్కొక్కళ్ళు "ఎక్కడ దొరికాడు" అంటున్నారు.

"అయితే నాగడి పెళ్ళాన్ని లోపలికితీసుకెళ్ళారెందుకు?" అని అడిగాడు సుబ్బన్న.

"నాగడి శవాన్ని కొయ్యడానికి పట్నం తీసుకుపోతారు. అంచేత కడసారిగా చూడ్డానికయి ఉంటుంది" ఈ సమాధానం బాగానే తోచింది సుబ్బన్నకు.

ప్రఖ్యాతి చెందిన నాణ్యము, అందము గల యీ దిగువ పేర్కొన్న పోర్టబుల్ గ్రామఫోనులు మా రెడీస్టాకునుండి సప్లయి చేయబడును

(1) హెచ్. యం. వి. మోడల్ 102 లేక కొలంబియా మోడల్ 9000 రు 250-0-0

(2) హెచ్. యం. వి. మోడల్ 88 లేక కొలంబియా మోడల్ 211 రు 155-0-0

గ్రామఫోను రికార్డులు, పిన్నులు, విడిసామానులు సరసమైన ధరలకు అమ్మబడును. గ్రామఫోనులుగూడా గ్యారంటిగా రిపేరు చేయబడును.

వివరములకు : మాధవ అండ్ కో

పోస్టు బాక్సు నెంబరు 56, విజయవాడ

"నాగడి శవాన్నీ వెంకట్రావునూ ఓసారి ఇవతలకు తీసుకొస్తే బాగుండును చూచి పోదుము" అనుకుంటున్నారు కొందరు. తుపాకి దెబ్బతో చచ్చిపోయిన వాడిని చూడాలని కొందరు కనిపెట్టుకున్నారు. ఓ గంట గడిచేసరికి ప్రతి వారిలోనూ విసుగు పుట్టింది. ఆ జరిగే విచారణ బయట జరిగితే బాగుండుననుకున్నారు. కొంతిమంది కరణాన్ని పోయి చూచి రమ్మన్నారు. కాని ఆయనకు వెళ్ళడానికి భయమేసింది.

"కరణంగారూ ఉరి అంటే ఎలా తీస్తారూ" అని అడిగాడు సుబ్బన్న.

"మెడకు త్రాగుకట్టి గోతిలో వ్రేలాడ తీస్తారు చాల బాధ పడతాడు"

"పడవలసిందే వెధవ. నన్నుకూడా చంప బోయాడు. ఉళ్ళోపడిందాకా నే బతుకు తాననుకోలేదు. పిస్తోలు తెచ్చి పేలుస్తాడా లేకపోతే వెధవ" అని తిడుతున్నాడు సుబ్బన్న.

"అప్పుడు నీ దగ్గరుండే పదిమంది ఎవరో అందర్నీ ఇక్కడే ఉండమను సాక్ష్యమివ్వాలి. లేకపోతే కబురంపు" అన్నాడు కరణం.

సుబ్బన్న వాళ్ళందర్నీ రావించాడు. వాళ్ళు పోలీసులతో మాట్లాడతారని, నాగడి శవం దగ్గరకంట నడతారని మిగతా వాళ్ళకు వాళ్ళమీద అసూయ పుట్టింది.

కొంత సేపటికి ఇద్దరు పోలీసులు ఇవతల కొచ్చారు. "అదిగో వస్తున్నారంటే వస్తున్నారు." అని అందరు నిక్క బొడుచుకు చూస్తున్నారు. నిశ్శబ్దం ఆవహించింది. కొంతమంది మెల్ల కుర్రాళ్ళను దూరంగా పొమ్మని కసురుతున్నారు.

సర్కిలూ, వెంకట్రావు యిక యికల్లోను పకపకల్లోనూ ఇవతలకొచ్చారు అందరకూ ఆశ్చర్యంవేసింది నాగడి శవంలేదు, వెంకట్రావుకు సంకెళ్ళూ లేవు. చడీచప్పుడు లేకుండా పోలీసు వాళ్ళు వచ్చిన దారినే పోయారు. శవాన్ని ఇంట్లోనే కప్పెట్టేశారని పుకారు బయలు దేరింది. "మళ్ళీ పై యజమానులకు తెలుపుదాం" అన్నాడు కరణం. సాక్ష్యానికనికూర్చున్న కూలాళ్ళు తాము అనుకున్న గౌరవం పొందలేదని విచారించారు.

మర్నాడు కరణానికి నోటీసు వచ్చింది. "ఇటువంటి అనవసర రిపోర్టులు ఇస్తే ఉద్యోగం ఊడిపోగలదు జాగ్రత్త" అని. కరణానికి గంగ వెర్రులెత్తినయ్. అసలు సంగతి అర్థం కాలేదు.

"ఓ ఐగు వందల రూపాయలు వదలించి బాగా బుద్ధి చెప్పావు" అంటూ ఆటో మాటికి పిస్తలును ముద్దు పెట్టుకున్నాడు వెంకట్రావు. నాగడు భార్యతో సహా రెండు నెలల వరకు పట్నంలో గడపడానికి వప్పుకున్నాడు. తరువాత ఆలోచించుకో వచ్చులే, అని వంద రూపాయ లిచ్చాడు. పోలీసువాళ్ళ కిచ్చిన దానితో మూడు వందలు వదలిసా తనంటే సుబ్బన్నకు భయం కలిగినందుకు సంతోషించాడు.

వెంకట్రావు కబురుపంపే వరకుసుబ్బన్న చేనుకు నీరు కట్టుకోడానికి వెళ్ళలేదు

పన్ను అడిగితే కాల్చేస్తాడేమోనని కరణం భయపడుతున్నాడని తెలిసి సూరయ్యచేత పంపించాడు డబ్బు. సరిగ్గా నూట ఎనభై అయిదు రూపాయలే పుచ్చుకున్నాడు కరణం.

★

# ఫ్రెంచి సినిమా పరిశ్రమ

(40-వ పేజీ తరువాయి)

మయింది. ఆ సంవత్సరం లియాన్ బ్లూమ్ అమెరికాతో ఒక ఏర్పాటు చేశాడు— ఫ్రెంచి అత్తర్లు వగైరా అమెరికాకు ఎగుమతి చేసి హాలీవుడ్ చిత్రాల దండును రానిచ్చాడు. వాటి రాకతో ఫ్రెంచి చిత్ర నిర్మాణం పీక నొక్కబట్టయి పోయింది. ఈ కబంధహస్తం సడలించడానికి 1948 లో పారిస్ ఫిలిం ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఫ్రాన్సుకు దిగుమతి అయే హాలీవుడ్ చిత్రాల సంఖ్య ఏడాదికి 121 గా నిర్ణయించ బడింది. ప్రతి పద మూడు వారాలలోనూ—మూడు, నెలలలోనూ—అయిదు వారాలు థియేటర్లలో ఫ్రెంచి చిత్రాలే. ఆడాలని నిర్బంధించ బడింది. ఇది కాక ఫ్రాన్సులో నడిచే చిత్రాలన్నిటిపైనా 8 మొదలు 10 ఫ్రాంక్ లవరకూ ప్రేక్షకపన్ను విధించబడి, ఈ పన్నుద్వారా వచ్చిన మొత్తం ఫ్రెంచి చిత్రాల సహకారానికి నిధిగా ఏర్పాటు చేయబడింది. రెండవచిత్రం ప్రారంభించే నిర్మాతలకు మొదటిచిత్రంమీద కట్టిన పన్ను ముదరా ఇవ్వబడుతుంది.

ఈ ఒప్పందాన్ని రద్దు చెయ్యటానికి అమెరికనులు శాయశక్తులా కృషిచేసి 1950 జూన్‌లో ప్రభుత్వం వరకూ దీన్ని తీసుకు పోయినారు. కాని ఈ విషయం సంప్రతింపులు జరగరాదని పత్రికలూ, సినిమా యూనియనులూ హోరాహోరీ పోరాడాయి. తాత్కాలికంగా అమెరికనులు తిరోగమించారు. ఈనెల మరొక అమెరికను "దాడి" ప్రారంభం అవుతున్నది. ఈ "దాడి"ని ఎదుర్కొనటానికి సినిమా రక్షణ సంఘం ఒకటి తయారవుతున్నది. ఈ సంఘంలో చిత్రనిర్మాతలూ, టెక్నీషియనులూ, సినిమా ప్రేక్షకులూ మొదలైన వారున్నారు. వీరంతా కలిసి, ఫ్రాన్సులోకి ఏటా 120 విదేశీ చిత్రాలకు మించి దిగుమతి కాకుండా చూడాలని—అంటే 65 ఇతర దేశ చిత్రాలు పోగా, 55 హాలీవుడ్ చిత్రాలు మాత్రమే దిగుమతి కావలిసి ఉంటుంది—, దేశీయ చిత్రాలు మూడు నెలలలో 6 వారాలు ఆడాలనీ ఆందోళన చేస్తున్నారు ఇదివరకు సాధించిన విజయమే వీరికి ప్రోత్సాహం ఇస్తున్నది. వీరికి విజయం కలుగుతుందని ఆశించుదాం.

(సెప్టెంబరు 8 "న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్" లోని హార్బర్ట్ వ్రాసిన వ్యాసం ఆధారంతో.)

★

వస్తువ మహిమ నాణ్యతలో కాన వచ్చును.



నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యము
కాని అత్యుత్తమమైనది
అప్పాదురై నశ్యమే
కారం, నాణ్యత, సువాసనకు పేరొందినది
అ. అప్పాదురై మొదలియార్ అండ్ సన్సు,
55 ఆచారప్పన్ వీధి :: మదరాసు

వాణీ కాలేజి, రాజమండ్రి
ఆంధ్రా, బెనారస్ మెట్రిక్ (జూనియర్ & సీనియర్); ఆంధ్రా, అజ్మీరు ఇంటరు, బి. ఏ. లకు డైరెక్టు & పోస్టలు ట్యూషను ఇవ్వబడును. ప్రాస్పెక్టసు రెండణాలు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras